సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21: సైబర్ క్రైం మోసానికి పాల్పడిన కేసులో హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన మహమ్మద్ అవాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ గృహిణి ఆన్‌లైన్‌లో పార్ట్ టైం జాబ్ పేరిట సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కుకొని రూ.31.60 లక్షలు పోగొట్టుకొని గత ఏడాది అక్టోబర్ 21న రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక పరిజ్ఞానంతో జొమాటో డెలివరీబాయ్, ఏసీ మెకానిక్ అయిన మహమ్మద్ అవాద్‌ను శనివారం హైదరాబాద్‌లో మలక్‌పేట్‌లోని సోహెల్ రెస్టారెంట్‌లో అదుపులోకి తీసుకొని విచారించారు. లక్షకు రూ.300 ఇస్తామని చెప్పడంతో సులభంగా డబ్బులు వస్తాయని తన పేరు మీద మూడు అకౌంట్లను ఓపెన్ చేసి ఇలియాస్ అనే వ్యక్తికి ఇచ్చినట్లు చెప్పాడు. సులభంగా డబ్బులు వస్తాయని బ్యాంకు అకౌంట్ వివరాలు, సెల్‌ఫోన్ సిమ్‌కార్డులు ఎవరికీ ఇవ్వకూడదని, సైబర్ నేరస్తుల చేతిలో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ ప్రజలకు సూచించారు.

రావి చెట్టుకు నిప్పుపెట్టిన దుండగులు

మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నూర్ రూరల్ (కోటపల్లి), డిసెంబర్ 21: మండలంలోని ఆలుగామ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు బస్టాండ్ ఆవరణలో యేండ్లనాటి రావిచెట్టుకు నిప్పు పెట్టారు. దీనిని గమనించిన ప్రస్తుత మాజీ సర్పంచ్ కుమ్మరి సంతోష్ అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే తమకి సమాచారం అందించాలని ఫైర్ సిబ్బంది సూచించారు. ఈ ఆపరేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, డ్రైవర్, ఫైర్‌మెన్లు శ్రీనివాస్, గణేశ్ ఉన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

చెన్నూర్, డిసెంబర్ 21: ఇటీవల నూతనంగా ఎన్నికైన పీఆర్టీయుటీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్‌ను శనివారం ఆ సంఘ సభ్యులు సన్మానించారు. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం చెన్నూర్ మండలశాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు జోడు మధు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు ఆర్‌కే ప్రసాద్, తిరుపతయ్య, పుట్ట శ్రీనివాస్, శ్యాంసుందర్, సుష్మ, సుశాంత్, సతీశ్, భాస్కర్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

హాజీపూర్, డిసెంబర్ 21 : మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన పొట్యాల శ్వేత-రోహిత్ దంపతుల కూతురు యశస్వి పుట్టిన రోజు సందర్భంగా ఆ గ్రామ పంచాయతీలోని పేదలకు రగ్గులను అందజేశారు. తమ కూతురు పుట్టిన రోజు సందర్భంగా పేదలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో రగ్గులను అందజేసినట్లు తెలిపారు.

రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న మూడు ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీ చేసేందుకు ఈ నెల 23న (సోమవారం) జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి హరీశ్‌రాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎంబీబీఎస్/బీఎంఎస్ అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. నెలవారి జీతం రూ.40వేలు ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మందమర్రి, డిసెంబర్ 21: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగులపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి పై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహాత్మా సంతోష్(35) మృతి చెందినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సంతోష్ రోడ్డు నడుచుకుంటూ దాటుతుండగా మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడన్నారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలయ్యాయని అతని వివరాలు తెలియరాలేదని ఆయన తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీసీ హాస్టల్ రోడ్డును బాగుచేయాలి

జన్నారం, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డును బాగుచేయించాలని కోరుతూ బీసీ సంఘం మండల నాయకులు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పొనకల్ పంచాయతీ కార్యదర్శి రాహుల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యాం వెంటనే రోడ్డును బాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడేపు లక్ష్మీనారాయణ, మహేశ్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో పతకాలు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 21: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ చూపి రెండు పతకాలు సాధించారు. హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలు జరిగాయి. మంచిర్యాల జిల్లాలోని గుడిపేట మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలకు చెందిన తిరుపతి, ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలకు చెందిన శాన్వీలు వెండి పతకాలు సాధించారు. ఈ ఇద్దరు క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ నిట్టూరి మైసూర్, కార్యదర్శి రాజ్‌కుమార్, అధ్యక్షుడు పాదం రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, పీడీ సురేశ్ అభినందించారు.

ఆదర్శనీయుడు అథ్లెటిక్స్ కోచ్ సూర్యనారాయణ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21: అథ్లెటిక్ కోచ్ వల్లభాపురపు సూర్యనారాయణను ఆదర్శంగా తీసుకొని క్రీడాకారులు రాణించాలని పుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ మెంబర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ఉదారి చంద్రమోహన్ గౌడ్ అన్నారు. వల్లభాపురపు సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా సమిష్టి వెల్ఫేర్ సొసైటీ, టాలెంట్ నృత్య కళానిలయం ఆధ్వర్యంలో మంచిర్యాలలోని వివేకావర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రమోహన్ గౌడ్ కలిసి కార్యక్రమ నిర్వాహకులు సునార్కర్ రాంబాబు నేతకాని, మోహన్ కృష్ణ, ముడారపు శేఖర్ సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని భారతదేశానికి ఎన్నో పతకాలు తేవడంలో విశేషంగా కృషి చేశారన్నారు. వర్ధంతి సందర్భంగా పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునార్కర్ రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

దండేపల్లి, డిసెంబర్ 21: పిల్లల సర్వతోముఖాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. దండేపల్లి మండలంలోని వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలనిసూచించారు. అనంతరం క్రమం తప్పకుండా వస్తున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను డీఈవో సన్మానించారు. అనంతరం ఆహార మేళాను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోలు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్యం దుకాణాలపై ప్లాస్టిక్ రైడ్

జరిమానా రసీదు అందజేస్తున్న అధికారులు

మందమర్రి, డిసెంబర్ 21: మందమర్రి పట్టణంలోని మద్యం దుకాణాల పై శనివారం మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ రైడ్ నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్, మార్కెట్, పాలచెట్టు ఏరియాలోని మద్యం దుకాణాలను తనిఖీ చేసి నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ వస్తువులు వాడుతున్న వారికి జరిమానా విధించారు. వైన్ షాపులకు రూ.3500 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, ఆర్ఐ కృష్ణప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సమీర్, సిబ్బంది లింగయ్య, శ్యాంబాబు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుత పులిదాడిలో మృతి చెందిన ఆవు దూడ యజమానికి పరిహారం

కాసిపేట, డిసెంబర్ 21 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులి దాడిలో మృతి చెందిన ఆవుదూడ యాజమానికి రూ.10,000 పరిహారాన్ని ఫారెస్ట్ అధికారులు అందించారు. ఇటీవల 19న దేవాపూర్ రేంజ్ పరిధిలోని ఫారెస్ట్‌లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం రోంపల్లికి చెందిన కుర్సింగ పాలకుడు అనే రైతుకు చెందిన ఆవుదూడపై చిరుత పులి దాడి చేయగా మృతి చెందింది. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులు పంచనామా చేసి శుక్రవారం రిపోర్ట్ పంపగా ఒక్క రోజులోనే శనివారం రూ.10,000 పరిహారం మంజూరయ్యాయి. బాధిత రైతుకు తిర్యాణి రోంపల్లి గ్రామానికి వెళ్లి చెక్కును ఫారెస్ట్ అధికారులు ఎఫ్ఎస్వో రాములు, ఎఫ్‌బీవో నాగమణి చేతుల మీదుగా అందించారు.

నేరాల నియంత్రణకు 'పల్లె నిద్ర' చేపట్టాలి

పోలీస్ స్టేషన్ లో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ

నెన్నెల, డిసెంబర్21: గ్రామాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు పల్లె నిద్ర చేపట్టాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్ పోలీసులను ఆదేశించారు. శనివారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఆయన వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్, పొలిటికల్ సమస్యలు, రౌడీ షీటర్లు, తదితర సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అక్రమ రవాణా, నాటుసార, గంజాయి రవాణాపై నిఘా పెట్టాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట రూరల్ సీఐ అబ్జలొద్దీన్, ఎస్ఐ ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా పుడ్ ఫెస్టివల్

దండేపల్లి, డిసెంబర్21: దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు గుడిరేవు పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులంతా తమ ఇండ్ల వద్ద వివిధ రకాల వంటలు తీసుకొచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ ఎంలు మల్లూరి శ్రీనివాస్, నరేంద్ర శ్రీనివాస్, ఎస్‌వోలు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, తదితరులు ఉన్నారు.

చెన్నూర్ రూరల్, కోటపల్లి, డిసెంబర్ 21: మండలంలోని పొక్కూర్‌లో గ్రామంలో జిల్లి పరిషత్ సెంకండరీ పాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం, పోషకుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం దత్తకుమార్ మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో విద్యార్థులు శ్రద్ధ చూపాలన్నారు. కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. కోటపల్లి మండలంలోని పలు పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జైపూర్, డిసెంబర్ 21: మండలంలోని ఇందారం ప్రభుత్వపాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తీసుకువచ్చిన వంటకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విద్యాధికారి శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గోపగాని రవీందర్, ఎం రమేశ్, కే రమేశ్, మంజుల, సంధ్యారాణి, పద్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మ్యాథ్స్ డే

శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : ప్రపంచం మొత్తం సైన్స్, గణితంతోనే అభివృద్ధి చెందుతున్నదని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హైస్కూల్లో మండల స్థాయి విధ్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్)నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనలను సీఐ వేణుచందర్ ప్రారంభించారు. ఎగ్జిబిట్లను తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు, కరస్పాండెంట్ సాహెబ్ హుస్సేన్ వర్ధంతి, గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు గణితం, సైన్స్‌పై ఆసక్తి కనబరిచి నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ జక్కెన రమేశ్, ప్రిన్సిపాల్ జాహిదా బేగం, డైరెక్టర్ ఇబ్రహీం, కౌన్సిలర్ పూదరి కుమార్ పాల్గొన్నారు.

గణిత ప్రయోగశాల ప్రారంభం

దండేపల్లి, డిసెంబర్ 21: దండేపల్లి మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఎస్ఐ విష్ణువర్ధన్, పన్నాల సంతోష్ దాతల సహకారంతో గణిత ప్రయోగశాలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్రలేఖనం, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు బొలిశెట్టి బుచ్చన్న, శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 21: సీసీసీ నస్పూర్ విద్యానగర్‌లోని కృష్ణవేణి పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా మ్యాథమెటిక్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తిని దేవన్న, పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

కాసిపేట, డిసెంబర్ 21 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత రంగోళీ, గణిత శాస్త్ర మేళా, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ముత్తవరం వెంకటేశ్వర స్వామి, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, గణిత శాస్త్ర అధ్యాపకులు సంయుక్త, భాగ్యశ్రీ, రవీంధర్, ఉపాధ్యాయులు నాగ మల్లయ్య, ప్రవీణ్, శ్రీవర్ధన్, సుష్మా మాధురి, చైతన్య స్రవంతి, అనిత, మల్లేష్ , మహేశ్వరి, రేణుక, పద్మజ, అశోక్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, డిసెంబర్ 21 : కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గణితంపై క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ణిత ఉపాధ్యాయులు సతీశ్, శ్రీకాంత్, విశ్వనాథ్‌ను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేటలో గణితంపై ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో

మందమర్రిలో గణిత విజ్ఞాన మేళాలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గుడిరేవులో గణిత ప్రయోగశాలను ప్రారంభిస్తున్న సెక్టోరియల్ అధికారులు.

ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్
- కమిషనరేట్‌లో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

ధ్యానం కార్యక్రమంలో పాల్గొన్న సీపీ, అధికారులు

ధ్యానం చేస్తున్న కమాండెంట్, పోలీసులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 21: ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడంతో రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో తొలి ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. కమిషనర్ అధికారులు, సిబ్బంది తో కలిసి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజేషన్ వలంటీర్లు రామ్ మోహన్ బండా, ఓం ప్రకాశ్ నిర్వహించిన మెడిటేషన్‌లో పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ విధుల్లో ప్రతి రోజూ చాలా రకాల ఒత్తిడికి, మానసిక, శారీరకంగా అలిసిపోతుంటారని, ఆరోగ్య సమస్యల నివారణకు ధ్యానం, ప్రాణాయామం, సుదర్శన క్రియ యోగా చేయాలని సూచించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజేషన్ వలంటీర్లు ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

-కమాండెంట్ వెంకట్రాములు

హాజీపూర్, డిసెంబర్ 21 : ధ్యానంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. బెటాలియన్‌లో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై బెటాలియన్ పోలీసులతో కలిసి ధ్యానం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఎంతో కొంత సమయం ధ్యానం కోసం కేటాయించాలని ఆయన సూచించారు. డిసెంబర్ 21ని ఐక్య రాజ్య సమితి ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్ రావ్, కాళిదాసు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్స్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

24న ఓరియంట్ ఎదుట నిరసన దీక్ష

కరపత్రాలు విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

కాసిపేట, డిసెంబర్ 21 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎదుట ఈ నెల 24న ఉదయం 7 గంటల నుంచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షను విజయవంతం చేయాలని మాజీ ఓరియంట్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాములు నాయక్, ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్లు, లోకల్ యూనియన్ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం ఓరియంట్ కంపెనీ గేటు ఎదుట సంబంధిత దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. సీకే బిర్లా యాజమాన్యం ఆదాని గ్రూపులకు అమ్మకం చేస్తున్న క్రమంలో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగో ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, తదితర డిమాండ్లపై దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తట్ల భీంరావు, సామ రాజిరెడ్డి, రామిళ్ల కిష్టయ్య, కే సతీశ్ రెడ్డి, సంద్ర భూమయ్య, గుండా శ్రీనివాస్, ముల్కల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్‌సెంటర్‌లో అపరిశుభ్రతపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

అర్బన్ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

తాండూర్ (బెల్లంపల్లి), డిసెంబర్ 21 : బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అపరిశుభ్ర వాతావరణంపై డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు.. మూడు రోజుల్లో దవాఖాన ఆవరణ, గదుల్లోని చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు.. ఐఎల్ఆర్‌డీ ఫ్రీజర్ ఐస్ ఫ్యాన్స్ ఫ్యాషన్ క్యారియర్స్ క్రమబద్ధంగా అమర్చుకోవాలని సూచించారు. అనంతరం అర్బన్ సెంటర్ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. అన్ని జాతీయ వైద్య కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి వెంకట సాయి, వైద్యురాలు సుచరిత, స్టాఫ్ నర్స్ లు, ఫార్మసిస్టులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానమే లక్ష్యం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 21 : సీఎం కప్ పోటీలు జిల్లా స్థాయిలో ముగిసినందున ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి ప్రథమ స్థానంలో నిలవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో చేపట్టిన జిల్లా స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లా యువజన క్రీడా అధికార కిర్తీ రాజ్ వీరు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, అధికారులు పోటు రవీందర్‌రెడ్డి, పురుషోత్తంనాయక్, రౌఫ్‌ఖాన్, రాజేశ్వరితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. జిల్లాలో పోటీలను విజయవంతం చేయడంలో జిల్లా అధికారుల కృషి అభినందనీయమని తెలిపారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 21: బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందిన డీఎడ్ విద్యార్థిని వెంకట లక్ష్మి మృతికి బాధ్యులపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకి వినతి పత్రం అందజేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం, భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆత్మకూరు చిరంజీవి, దుర్గం దినకర్, జగజంపుల తిరుపతి, ఆవిడపు ప్రణయ